'స్థానిక' సమరానికి సై



- ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు
- షెడ్యూల్ కోసం జిల్లా నాయకుల ఎదురుచూపులు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ
- పట్టు నిలుపుకునేందుకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ముందస్తు ప్రణాళికలు
- ఉనికి కోసం బీఆర్ఎస్ ఆరాటం

నిర్మల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల్లోనే స్థానిక ఎన్నికలు జరగనున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆ దిశగా సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ జారీ కోసం పార్టీలు ఎదురుచూస్తున్నాయి. కాగా ఈ సారి జరిగే ఎన్నికలు ప్రధానంగా మూడు పార్టీలకు సవాలుగా మారబోతున్నాయి. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎన్నికలను ఆయా పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అవకాశాలున్నాయి. దీంతో స్థానిక ఎన్నికల సమయం పల్లెల్లో హోరెత్తబోతోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ సారి జరిగే స్థానిక ఎన్నికల్లో పోటాపోటీగా తలపడనున్నాయి. అయితే మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల ద్వారా తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేయనుందని అంటున్నారు. ఇప్పటికే నాయకులు కార్యకర్తల కొరతతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీ కనీసం స్థానిక ఎన్నికల్లో కొన్ని స్థానాలనైనా కైవసం చేసుకొని తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. అయితే స్థానిక ఎన్నికల కోసం మూడు ప్రధానపార్టీలు సిద్ధమవుతుండడంతో ఈ సారి ఈ ఎన్నికల ఘట్టం రసవత్తరంగా మారనుందని అంటున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఈ ఎన్నికలు ఛాలెంజ్‌గా మారబోతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆ పథకాల ద్వారా గెలుపు సాధించేందు కోసం వ్యూహరచనలు చేయబోతోంది. అయితే ఓటర్లలో హిందుత్వ సెంటిమెంట్ బలంగా పెరుగుతున్న కారణంగా స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా గెలుపు సాధించి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందు కోసం బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోందంటున్నారు. కాగా నాయకత్వ కొరతతో సతమతమవుతున్న బీఆర్ఎస్ తిరిగి పుంజుకునేందుకు ఈ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని భావిస్తోంది. ఇలా మూడు పార్టీలు ఎవరికి వారే తమ సత్తా చాటుకునే ప్రయత్నం చేయబోతుండడంతో రాజకీయాలు ఆసక్తికరంగా మారనున్నాయి.

కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం

అధికార కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకం కాబోతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్‌ల తప్పుడు ప్రచారం అలాగే ప్రతీరోజూ చేస్తున్న విమర్శలకు ఈ ఎన్నికల్లో గెలుపు సాధించి ఈ రెండు పార్టీలకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. దీనికి అనుగుణంగానే జిల్లాలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇప్పటికే పలుదఫాలుగా వివిధ అంశాలపై సూచనలు కూడా ఇచ్చారు. ఆ పార్టీ పరిశీలకులు పలుసార్లు జిల్లాలో పర్యటించి నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండేట్లు ప్రయత్నించారు. విభేధాలు పక్కన పెట్టి గెలుపు కోసమే పని చేయాలని పరిశీలకులు ఇప్పటికే నేతలకు సూచించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఈ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా మలుచుకోబోతోంది. కార్యకర్తలందరు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లి వారి మద్దతును కూడగట్టాలన్నదే టార్గెట్‌గా పెట్టుకోబోతున్నారు. జిల్లాలోని ముఖ్య నాయకులందరికీ ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఆ దిశగా సంకేతాలు అందించింది. అధికారంలో ఉన్న కారణంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను సవాలుగా తీసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి తదితరులు తమ తమ పరిధిలో కేడర్‌ను స్థానిక ఎన్నికల వైపు మళ్లించేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో సత్తా చాటి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తన సత్తాను చూపాలని భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

సెంటిమెంట్ అస్త్రంగా బీజేపీ

ఆపరేషన్ సింధూర్ సక్సెస్ కావడం అంతటా హిందుత్వ సెంటిమెంట్ బలంగా విస్తరిస్తుండడాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్‌లు ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై స్థానిక ఎన్నికలపై చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు హిందుత్వ సెంటిమెంట్‌ను ఈ సారి ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి అత్యధిక స్థానాలు సాధించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. గత వారం రోజుల క్రితం బీజేపీ నేత ఏలేటీ మహేశ్వర్ రెడ్డి మూడు నియోజకవర్గాల్లోని ఆ పార్టీ నేతలందరితో రహస్య సమావేశాలు నిర్వహించి ఎన్నికల వ్యూహాలను వారికి వివరించినట్లు సమాచారం. అయితే ఈ సమావేశానికి సంబంధించి సమాచారం లీక్ కాకుండా మహేశ్వర్ రెడ్డితో పాటు ఆ పార్టీ నేతలంతా జాగ్రత్త పడడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ సారి అధికార కాంగ్రెస్ పార్టీని ఓడించి తన బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలపై అంతటా ఆసక్తి నెలకొంటోంది.

అస్తిత్వం కోసం బీఆర్ఎస్ ఆరాటం

మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో పూర్తి జవసత్వాలు కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ కనీసం ఈ స్థానిక ఎన్నికల్లోనైనా కొంతమేర ప్రభావం చూపి తన అస్తిత్వాన్ని నిలుపుకోవాలని ప్రయత్నించనుందని అంటున్నారు. ఇప్పటికే ఆ పార్టీకి సరియైన నాయకత్వం లేక కేడర్ అంతా తలొదిక్కుగా చీలిపోయారు. అయితే అధికార కాంగ్రెస్, బీజేపీల్లోని అసంతృప్తి వాదులను, తటస్థంగా వ్యవహరిస్తున్న నాయకులు, కేడర్‌ను తిరిగి తమ వైపు తిప్పుకొని పార్టీని తిరిగి పునర్ నిర్మాణం చేయాలని బీఆర్ఎస్ ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు గట్టి పోటీనిచ్చి తిరిగి తన పట్టును పెంచుకునే ప్రయత్నాలను ఆ పార్టీ చేపట్టనుందని అంటున్నారు.

గిరి క్షేత్రంలో అంగరంగ వైభవంగా కావడి సేవ


కావడి మోస్తున్న భక్తులు

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీగిరి క్షేత్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా కావడి సేవ నిర్వహించినట్లు గురుమాత రాజరాజేశ్వరి దేవి తెలిపారు. ఈ సందర్భంగా పంచామృతాలతో స్వామివారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించినట్లు తెలిపారు. తదనంతరం భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమాన్ని ఏడిపెల్లి గోపి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీర నారాయణ స్వామి, శనిగారపు చిన్నయ్య, గురుస్వామి, సముందర్‌పల్లి కిషన్, పి. అనిల్, నర్సాగౌడ్, దినేష్, నగేష్, గణేష్‌పాల్గొన్నారు.

గణపతి, సుబ్రహ్మణ్యస్వామి
ఆలయాల్లో పంచామృతాభిషేకాలు


సుబ్రహ్మణ్యస్వామికి హారతి ఇస్తున్న గురుస్వామి

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్టలో గల గణపతి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో మంగళవారం పురస్కరించుకొని పంచామృతాభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ గురుస్వామి మూర్తి తెలిపారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దేవేందర్ రెడ్డి, రవిరెడ్డి, వాసు, కరుణాకర్, ఆలయ కోశాధికారి సామల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పుకార్లను నమ్మవద్దు..
తరగతులు యథావిధిగా కొనసాగుతున్నాయి : కలెక్టర్

నిర్మల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలోని రాజుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటుకు సోమవారం కాంట్రాక్టర్ తాళం వేసిన ఘటనపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పాఠశాల తెరిపించింది. ప్రస్తుతం విద్యార్థులు యథావిధిగా తరగతులకు హాజరవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి అనవసర పుకార్లు, అపోహలు వ్యాపిస్తున్నాయి. పుకార్లను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం ద్వారా గందరగోళం సృష్టించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు, తల్లిదండ్రులు ఏవిధమైన భయాందోళన లేకుండా విద్యార్థులను పాఠశాలకు పంపాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

నేడు భైంసాకు ఎస్పీ

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బుధవారం భైంసాలో పర్యటిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకిషర్మిల తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు.

క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక

మండలంలోని జడ్పీహెచ్ఎస్ రత్నాపూర్ కాండ్లి పాఠశాలలో బుధవారం క్రీడాపాఠశాల ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్ తెలిపారు.


పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని 135 మంది లబ్ధిదారులకు రూ. 45 లక్షల 64 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేస్తూనే, నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, ఆయా మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సమస్యలు లేకుండా చూడాలి : ఆర్డీవో


బాసర దేవస్థాన అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి

బాసర,జూన్17(ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి తీరంలో భక్తులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావద్దని ఆ దిశగా ముందస్తు చర్యలు తీసుకోవాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు గోదావరి నదిలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో మంగళవారం బాసర సరస్వతీ అమ్మవారి దేవస్థానం అతిథి గ్రామంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి స్నానఘట్టాల వద్ద భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి చర్చించారు. ఏ శాఖలు ఏఏ పనులు చేయాలో సూచించారు. భక్తులు స్నానాలు ఆచరించే స్నాన ఘట్టాల వద్ద లోతైన ప్రదేశాలు తెలిసే విధంగా ఎర్ర జెండాలను ఏర్పాటు చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అణువుగా అవసరమైనవి ఏర్పాటు చేయాలని చెప్పారు. రద్దీ దినాల్లో స్నాన ఘట్టాల వద్ద పోలీస్ సిబ్బందిని ఉంచాలని నిర్ణయించారు. స్నాన ఘట్టాల వద్ద భక్తులు ప్రమాదవశాత్తు నీటమునిగే పరిస్థితే రక్షించే విధంగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడమే కాకుండా వారి విధులపై పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో బాసర తహసీల్దార్ పవనచంద్ర, సరస్వతీ ఆలయ సూపరిండేంట్ శివరాజ్, దేవస్థాన సానిటేషన్ అధికారి నారాయణ పటేల్, నీటి పారుదల శాఖ, మత్స్యశాఖ, పోలీస్‌శాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాసరలో స్నాన ఘట్టాల వద్ద చెత్త తొలగింపు

గోదావరి తీరంలో భక్తుల స్నానఘట్టాల వద్ద సరస్వతీ దేవస్థాన సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్నానఘట్టాలతో పాటు నది పరిసరాల్లో చెత్తా, చెదారాన్ని తొలగించారు. ఘాట్లను నీటితో కడిగి శుభ్రం చేశారు.

ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి


కొరిటికల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మామడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పేదవారిని గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొరిటికల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ ఒక్క నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయించిన దాఖలు లేవని ప్రభుత్వం స్పందించి ప్రతి పేదవాడికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రైతులకు రుణమాఫీ సకాలంలో కాలేదని, ఎలక్షన్లు వస్తేనే రైతు భరోసా, రైతు రుణమాఫీ గుర్తుకు వస్తుందా అని ఎద్దేవా చేశారు. ఇకనైనా రైతుల పక్షాన నిలబడి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేని పక్షంలో రైతుల పక్షాన పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, బాపురెడ్డి, సరికెల గంగన్న, మండల బీజేపీ అధ్యక్షుడు రంజిత్‌కుమార్, న్యాయవాది, పీఏసీఎస్ డైరెక్టర్ ఏలేటి చిన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు చిన్న లింగారెడ్డి, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే

లక్ష్మణచాంద, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించారు. కాశీగూడ, నర్సా పూర్(డబ్ల్యూ), బాబాపూర్, రాచాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానికంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధారాథోడ్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షులు చిన్నయ్య, ప్రచార కమిటీ కన్వీనర్ అడ్వాల రమేష్, మాజీ ప్రజాప్రతినిధులు జీవన్‌రెడ్డి, గంగారెడ్డి, బి. పోశెట్టి, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్, లక్ష్మణ్, లింగాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఏలేటి

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌట్ల(కే) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, జమాల్, మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి, శ్రీను, బాపురావు, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం, శ్యామ్‌రెడ్డి, ధర్మన్న, రాజేశ్వర్, అశ్వద్ధామ, ముత్యం, రమేష్, సాయేందర్, వీడీసీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణచాంద మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేస్తున్న ఏలేటి

మండలంలోని తాంశ గ్రామంలో ఎస్సీ కాలనీలో రూ. 40 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. సత్యం చంద్రకాంత్, శ్రీను, ధర్మన్న, నరేందర్, వీడీసీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సోన్ మండలంలో..

సోన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు, రూ. 40 లక్షలతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. న్యూ వెల్మల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే సంగంపేట్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సిద్దులకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని 23 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బీజేఎల్పీనేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, నాయకులు హరీష్ రెడ్డి, నరేష్, నర్సయ్య, రాజేశ్వర్, సంతోష్, సవీన్, శ్రీను, రాములు, అమృత్య, సత్యం, మక్కన్న, పోశెట్టి, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి మృతి

పెంబి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల ప్రకారం... గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన గౌరి(22) ప్రేమ వ్యవహారం తెలియడంతో కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురై సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకరి మరణానికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తోట చుట్టూ జీఐ వైరు చుట్టి దానికి విద్యుత్ సరఫరా చేశాడు. దీంతో ఒకరి మరణానికి కారణమైన వ్యక్తికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, రెండు వేల జరిమానా విధించినట్లు జిల్లా న్యాయాధికారి శ్రీవాణి తెలిపారు. దెగావత్ శంకర్ నీలాయిపేటకు చెందిన తన మొక్కజొన్న తోట చుట్టూ అడవి జంతువులు వస్తాయని జీఐ వైర్‌తో చుట్టి దానికి కరెంటు సప్లై ఇచ్చాడు. ఇట్టి కరెంటు సప్లై ద్వారా జంతువులే కాకుండా మనుషులు కూడా చనిపోతారని తెలిసి కూడా తన తోట చుట్టూ జీఐ వైర్ చుట్టి దానికి కరెంటు సప్లై ఇచ్చాడు. దీని వల్ల బంకోల్ల భూమేష్ నివాసము ముథోల్ అనే వ్యక్తి కాలికి ఆ వైర్ తగలడం వల్ల భూమేష్ అక్కడికక్కడే మరణించాడు. కేసు సాక్ష్యాలను పరిశీలించిన తరువాత మంగళవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి కోర్టు జడ్జి శ్రీవాణి నిందితుడికి 2 సంవత్సరాల జైలుశిక్ష, రూ.2,000ల జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ.. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకోలేరని ఎస్పీ అన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పోలీసుశాఖ ప్రజ ల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ, న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టడా నికి పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. నిందితుడి కి శిక్ష పడడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.వినోద్‌రావు, విచారణ అధికారులు, ఇన్స్‌పెక్టర్లు ఎల్. జీవన్ రెడ్డి (ప్రస్తుతం డీఎస్పీ) బి. శ్రీనివాస్, ఎస్సై వి. అనూష, డ్యూటీ ఆఫీసర్స్ అయిన ఏఎస్సై డల్లు సింగ్, ప్రభాకర్ హెచ్‌సి, సురేష్ పీసీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ధర్నా



కడెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు అర్హులైన నిరుపేదలు తమకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు, లింగాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగాపూర్ గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని, ఇళ్లు, భూములు ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూ రు చేశారని మాకు భూములు, ఇళ్లు లేకున్నా మంజూరైన ఇళ్ల జాబితాలో తమ పేర్లు రాలేవని, తాము నిరుపేదలమని దాదాపు నాలుగు గంటలు ఎండలో కూర్చోని పేదలు ఆందోళన చేస్తుండడంతో అందులో నుండి ఒక మహిళ ఎండ వేడిమి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పై విషయంపై స్పందించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి, అధికారులకు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు కోరారు.

కడెంలో గుప్త నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు


స్వామివారి విగ్రహం (ఫైల్)


ధ్వంసమైన విగ్రహాలు


సంఘటన స్థలంలో లభ్యమైన కడ్డీలు

కడెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోస్తునగర్ సమీప అటవీ ప్రాంతంలో కొండపై గుహలో వెలిసిన నల్లగొండ నరసింహస్వామి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన భక్తులకు విగ్రహాలు కనిపించలేదు. కొంత దూరంలో విరిగిన విగ్రహాలు కనిపించడం ఉర్దూలో ఏదో రాసి ఉన్న ఇత్తడి కడ్డీలు తవ్వకాలు చేపట్టిన పార, తట్ట, సంచులు, నిమ్మకాయలు లభ్యం కావడంతో అందరూ విస్తు పోయారు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంట పొలాలకు రహదారి నిర్మించుకున్న రైతులు

బాసర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కిర్గుల్ (కె) గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు మంగళవారం రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చేపట్టిన ఈ పనులపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శుభ్రత.. మన ఆరోగ్యానికి భద్రత : ఎంపీవో

దిలావర్‌పూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం భద్రంగా ఉంటుందని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వలో ట్యూస్ డే... డ్రై డే... కార్యక్రమం నిర్వహించారు.



ఇచ్చోడ పోచమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ కులస్తులు

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

ఇచ్చోడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం, సిరికొండ మండల కేంద్రంలోని మహాలక్ష్మి పోచమ్మ ఆలయంలో మంగళవారం ఇచ్చోడ మండల నాయీబ్రాహ్మణ కులస్తులు వారి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ప్రతీ ఏడాది జూన్‌లో ఏరువాక మిరుగు పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామదేవతలకు ప్రత్యేక బోనాలు, నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వచ్చే పండుగను యేటా పండగల నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవున్ని స్మరించుకుని, మేకలతో మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వడ్నాల రవి, వడ్నాల రాము, డేగాల రవి, సింగారపు శంకర్, కత్తులపూర్‌న పోతన్న, గిరిధర్, గంగన్న, శ్యాం, సింగారపు కార్తీక్, శంకర్, దీలిప్, మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ

ఆదిలాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పార్డి(బి) గ్రామంలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ సోయం బాపురావు పరామర్శించారు. పార్డి(బి) మాజీ ఎంపీటీసీ బండు పటేల్ సతీమణి లలిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ మంగళవారం స్థానిక నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పంటలు సమృద్ధిగా పండాలని పాదయాత్ర

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణంతో పాటు ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తూ బేల మండలానికి చెందిన పలువురు భక్తులు పండరీపూర్‌లోని విఠలేశ్వరుడి సన్నిధికి బయలుదేరారు. మండల కేంద్రానికి చెందిన భక్తుడు పండరినాథ్ బోయర్ నేతృత్వంలో వంద మంది భక్తుల బృందం చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పాత హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ భక్తుడు భక్త బృందాన్ని ఆహ్వానించి అతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు అతడి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భజన సంకీర్తనలు ఆలపించారు. అనంతరం యాత్ర బృందం తిరిగి బయలుదేరింది.



పాదయాత్రగా పండరీపూర్‌కు తరలి వెళ్తున్న భక్తులు

పాత కరత్వాడ పాఠశాలలో ఒకే విద్యార్థి

● ఉపాధ్యాయురాలూ ఒక్కరే.. ● పిల్లలు రాక పాఠశాల ఎత్తివేసేందుకు చర్యలు ● తప్పకుండా బడికి పంపాలి : ఎంఈవో

బోథ్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతకరత్వాడ గ్రామంలోని పాఠశాల మూతపడే విధంగా ఉంది. పాఠశాలలో విద్యాబోధన కొనసాగించేందుకు గాను ప్రభుత్వం ఒక ఉపాధ్యాయురాలిని నియమించింది. అయితే విద్యార్థులు లేకపోవడంతో అధికారులు పాఠశాలలను మూసివేసి ఉపాధ్యాయురాలిని మరోచోటికి డిప్యూటేషన్‌పై పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



● పీహెచ్‌సీలో కొనసాగుతున్న పాఠశాల

● ఒకే విద్యార్థి, ఒక్క ఉపాధ్యాయురాలు

కరత్వాడ గ్రామం పక్కన ప్రాజెక్టు ఏర్పడక పోవడంతో గ్రామంలో ఉన్న వారంతా కొత్తగా ఏర్పాటు అయిన గ్రామానికి వెళ్లిపోయారు. దీంతో పాత కరత్వాడ గ్రామంలో విద్యార్థులు లేక పాఠశాల కళా విహీనంగా మారింది. గత ఏడాది ముగ్గురు పిల్లలు ఉన్న ఈ పాఠశాలలో.. ప్రస్తుతం ఒకే ఒక్కడు ఉన్నాడు. అయితే ఆమెను సైతం ప్రభుత్వ హాస్టల్‌కు పంపించేందుకు కుటుంబీకులు సిద్ధమవుతున్నారు. దీంతో పాఠశాల మూతపడే ఆస్కారం ఉందంటున్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో

● ఆరోగ్య కేంద్రంలోనే పాఠశాల

కరత్వాడలో ఉండే వారంతా నూతనంగా ఏర్పాటైన మరో గ్రామానికి వెళ్లిపోవడంతో పాత పాఠశాల కూలిపోతోంది. దీంతో ముందు జాగ్రత్తగా పాఠశాలను అధికారులు ఆరోగ్యం కేంద్రంలో నిర్వహించుకోవాలని సూచించారు. అధికారుల ఆదేశానుసారం పాఠశాలను ఆరోగ్య కేంద్రంలోని చిన్న గదిలో నిర్వహించుకోవాల్సి వస్తున్నాయి. దీంతో విద్యాబోధనకు ఆటంకాలు కలుగుతున్నాయి.

● విద్యార్థులను పంపితే పాఠశాల ఉంటుంది

గ్రామానికి చెందిన విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలకు పంపకుండా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే పాఠశాలను ఎత్తివేయమని.. అంతేగాక విద్యా బోధన కొనసాగుతుందని ఎంఈవో మహమ్మద్ హుస్సేన్ గ్రామస్థులకు తెలిపారు. అంతేగాక మంగళవారం గ్రామానికి వెళ్లి గ్రామస్థులతో ఈ విషయమై చర్చించారు. ఏది ఏమైనా పాత కరత్వాడలో పాఠశాల ఇబ్బందుల నడుమ కొనసాగనుంది.



అందర్‌బంద్‌లో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



బుగ్గరాం గ్రామంలో వైద్య చికిత్సలు అందిస్తున్న పవార్ రవీందర్

అందరి సమన్వయంతో వ్యాధుల నియంత్రణ

● భీంపూర్ వైద్యాధికారి నిఖిల్ రాజ్

భీంపూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో క్షేత్రస్థాయిలో అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో వ్యాధుల నియంత్రణ చేయవచ్చని భీంపూర్ వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. మంగళవారం భీంపూర్ మండలం అందర్‌బంద్‌లో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆస్మాన్ భారత్ కార్డు తయారు చేయడం గురించి వివరించారు. తలసేమియా, సైకిల్ సెల్ వ్యాధుల నియంత్రణ గురించి చెప్పారు. వర్షాకాలం వ్యాధులు రాకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. శిబిరంలో పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్ వైజర్లు రోహిదాస్, సాహితీ, మాయావతి, ఎంఎల్‌హెచ్‌పీలు జనాబాయి, విజయ లక్ష్మీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని బుగ్గరాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించి గ్రామాలలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ ప్రకాష్, హెచ్‌ఎస్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నిఖిత్, హెచ్‌ఏ శ్రీనివాస్ రెడ్డి, ఆశా కమల, తదితరులు ఉన్నారు.



నిరుపయోగంగా మారిన హత్తిఘాట్ ఎత్తిపోతల పథకం

ఎత్తి.. పోయట్లే!

(5వ పేజీ తరువాయి...)

కనిపిస్తున్నాయి. పూర్తయిన వరకు నీటిని వదిలితే రైతులు మోటర్ల ద్వారా పంటలకు నీటిని సరఫరా చేసుకునే అవకాశం ఉంటుంది. అయిన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంటుంది.

సర్వేకే పరిమితం

బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామ సమీపంలో నిర్మించనున్న కాండ్లి ఎత్తిపోతల పథకం సర్వేకే పరిమితమైంది. స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క గతేడు జిల్లాలో పర్యటించిన సందర్భంగా కాండ్లి ఎత్తి పోతల పథకానికి భూమిపూజ చేశారు. అయినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడినట్లు కనిపించడం లేదు. నిధులు మంజూరు కాకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రారంభించిన తొలి ఎత్తిపోతల పథకం ఇదే కావడం గమనార్హం. ఇప్పటి వరకు నయా పైసా నిధులను విడుదల చేయక పోవడం తో కాండ్లి ఎత్తిపోతల పథకంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా చిన్ననీటి పథకాలపై ప్రభుత్వాలు చిన్నచూపు చూడడంతో ఏళ్ల తరబడి అర ఎకరం ఆయకట్టుకు సాగునీరు అందిన దాఖలాలు లేవు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నార్నూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కారణంగా వారం రోజుల క్రితం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామంలో పిడుగు పాటుతో మృతి చెందిన పెందుర్ మాధవ్ రావు, సిడాం రాంబాయి, మంగం భీంబాయి పెందుర్ సుజాత కుటుంబ సభ్యులను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పరామర్శించి ప్రగాఢ సానుభతి తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రతీ కుటుంబానికి తనవంతు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కారణంగా పిడుగ పడి మృతి చెందటం చాలా బాధాకరమైన విషయమన్నారు. వారి కుటుంబాలకు న్యాయం చేసే దిశగా పూర్తి వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీరితో పాటు బేల మండలంలో కూడా అదే రోజు మృతి చెందిన వారికి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. వారి వెంట ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

● అధిష్ఠానం ఆదేశాలను పాటించడమే నా ఎజెండా

ఉట్నూర్: కాంగ్రెస్ పార్టీ జెండా కింద పనిచేస్తున్న తాను.. పార్టీ అధిష్ఠానం ఆదేశాలను పాటించడమే తన ఎజెండా అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం రాత్రి స్థానికంగా జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ప్రతీ పనిని నిబద్ధతతో చేయడం అలవాటు అని అన్నారు. పార్టీ అధిష్టానం అందించిన సూచనల మేరకు కార్యకర్తలతో, నాయకులతో మాట్లాడుతానని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో విజయం సాధించాలంటే ప్రతీ కార్యకర్త నాయకుడు ప్రజల మధ్య మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పార్టీ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు పార్టీలకతీతంగా పాలనను కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

● ఖానాపూర్‌లోని సదస్సులో కన్స్యూమర్ ఫోరం చైర్మన్



విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో కన్స్యూమర్ ఫోరం చైర్మన్‌కు సమస్యలు చెప్పుకుంటున్న వినియోగదారులు

ఖానాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సదస్సు)లు నిర్వహిస్తున్నట్లు కన్స్యూమర్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్ నిజామాబాద్) చైర్మన్ ఇ.నారాయణ తెలిపారు. సీజీఆర్‌ఎఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఖానాపూర్ విద్యుత్‌శాఖ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, మామడ ఐదు మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సదస్సుకు ఐదు మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరయ్యారు. 12 సమస్యలపై కన్స్యూజర్ ఫోరం చైర్మన్‌కు వినియోగదారులు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ టెక్నికల్ సెంబర్ రామకృష్ణ ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఎస్‌ఈ సుదర్శనం, డీఈ నాగరాజు, ఏడీఈ తుమ్మ శ్రీనివాస్, ఖానాపూర్ ఏఈ రాంసింగ్ సహా ఐదు మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

కుబీర్ మండలంలో ఎలుగుబంటి సంచారం



కుబీర్, జూన్17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలో బెల్గాం తాండ -1 పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు మండలవాసులు తెలిపారు. తాండా సమీపంలోని పల్లె ప్రకృతివనం ఆవరణలో వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న తాండా వాసులకు ఎలుగుబంటి కనిపించింది. దీంతో తాండా వాసులు, రైతులు, కేకలు వేయడంతో అక్కడినుంచి సమీప అడవి ప్రాంతానికి పరుగులు తీసింది. దీంతో తాండా వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. గతంలో మండలంలోని దార్‌కుబీర్ గ్రామానికి చెందిన ఈర్వా అనే రైతు అటవి ప్రాంతానికి వెళ్లగా అతనిపై ఎలుగుబంటి దాడి చేసి గాయపర్చినట్లు తాండా వాసులు తెలిపారు. ఈ ప్రాంతంలో దాదాపు నాలుగు ఎలుగుబంట్లు సంచరిస్తాయని అటవి శాఖ అధికారి లక్ష్మన్ తెలిపారు. తాండా వాసులు తమ చేల్లలో కంచెలకు విద్యుత్‌షాక్‌లు పెట్టవద్దని తాండా వాసులకు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

మల్లాపూర్‌లో సెంట్రల్ వాటర్ కమిషన్ సర్వే

లక్ష్మణచాంద, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ కౌన్సిల్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) అనే ప్రత్యేక కమిషన్ ద్వారా ఒక ప్రత్యేక సర్వేను మంగళవారం నిర్వహించారు. గ్రామంలో గల పలువురు వ్యక్తులను ప్రశ్నించి 83 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. భారీ నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా ఆ పరిసర గ్రామాల్లోని ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందాలన్న దానిపై ఆరా తీశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సరఫర అయిన సాగునీరు, త్రాగునీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక ప్రజలలో ఎలాంటి ఫలితాలు తీసుకొచ్చిందనే విషయాలను రాబట్టేలా పై అంశాలుండటం విశేషం. సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా, రాజకీయ పరంగా, ఉపాధి కల్పనపరంగా ప్రజలలో ఎలాంటి మార్పులు తెచ్చిందనే విషయాలపై తెలుసుకున్నారు. మండలంలో ఈ సర్వేకు మల్లాపూర్ గ్రామం మాత్రమే ఎంపిక కావటం గమనించదగినది.

వృద్ధ దంపతులను మోసం చేసి బంగారు చైన్ అపహరణ

● అధికారులమంటూ బురిడి కొట్టిన అగంతకులు ● బాధితులు కుంటాల మండలం అంబకంటివాసులు



రోదిస్తూ పేపర్‌లో చుట్టి ఇచ్చిన మట్టిని చూపుతున్న బాధితురాలు రాజవ్వ, భర్త గోవింద్ .. వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భైంసా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో మంగళవారం ముగ్గురు సభ్యులతోనున్న అగంతక ముఠా ఒకటి వృద్ధ దంపతులకు బురిడికొట్టి రెండు తులాల బంగారు చైన్‌తో ఉడాయించిన ఘటన జరిగింది. స్థానిక పిప్రి కాలనీ పరిధిలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి బాధిత దంపతులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుంటాల మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు రాజవ్వ, గోవింద్‌లు మంగళవారం భైంసాలోని పిప్రి కాలనీలో గల బంధువు ఇంట్లో శుభకార్యానికి వచ్చారు. బస్సు దిగి కాలనీ వైపు నడుచుకుంటూ వెలుతుండగా అక్కడి మార్గంలో ద్విచక్ర వాహనంపై కాపు కాచి ఉన్న ముగ్గురు అగంతకులు వృద్ధ జంటను ఆపి తాము అధికారులమంటూ నిలిపివేసి మాట్లాడారు. చోరీలు అధికమైన దృష్ట్యా ధరించిన బంగారు చైన్‌ను మెడలో నుంచి తీసివేసి లోపల దాచి పెట్టుకోవాలంటూ ఆదేశించారు. ఇదే సమయంలో . అగంతకులలో ఒకరు ముందుగా తాము వేసుకున్న ప్లాన్‌ప్రకారం బంగారు చైన్, ఉంగరాలు ధరించి వారి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్లారు. దీంతో మిగతా ఇద్దరు ఆగంతకులు తమ ముందు నుంచి వెలుతున్న తమ ముఠాలోని అగంతుడిని గదమాయించి పిలిచి మందలించారు. బంగారు చైన్, ఉంగరాలు పేపర్‌లో చుట్టి పెట్టుకోవాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగానే మూడవ ఆగంతకుడు తాను ధరించిన చైన్, ఉంగరాలను తీసివేసి మిగతా ఇద్దర ఆగంతకులకు అందించాడు. వెంటనే వారిద్దరు వాటిని పేపర్‌లో చుట్టిపెట్టి అందివ్వగా సంబంధిత పేపర్ చుట్టను తీసుకొని మూడవ నిందితుడు అక్కడి నుంచి .నిర్మల్ మార్గం వైపు నడుచుకుంటూ వెళ్లిపోయాడు.తదుపరి ఇద్దరు అగంతకులు వృద్ధురాలు ధరించిన బంగారు చైన్‌ను తీసి పేపర్‌లో పెట్టుకోవాలని నమ్మబలికేలా సూచించారు.. వృద్ధురాలు రాజవ్వ తాను ధరించిన బంగారు చైన్‌ను మెడలో నుంచి తీసివేయగా అగంతడొకరు తాను పేపర్ పొట్లంలో పెట్టి ఇస్తానని నమ్మించి వృద్ధురాలి నుంచి బంగారు చైన్‌ను తీసుకున్నారు. మరో అగంతకుడు వృద్ధ దంపతులను మాటల్లోకి దించగా మిగతా అగంతకుడు బంగారు చైన్‌ను దాచిపెట్టి ముందుగానే తన వద్ద పెట్టుకొని ఉంచిన ఉంచుకున్న మట్టి పెట్టి చుట్టిన పేపర్‌ను అందించి సంచిలో దాచుకోవాల్సిగా సూచించారు. దీంతో వృద్ధురాలు అగంతకులు అందించిన మట్టి పేపర్ కవరును పరిశీలించకుండానే సంచిలో వేసుకొని నడుచుకుంటూ బంధువుల ఇంటి వైపు వెళ్లారు. ఇదే సమయంలో అగంతకులు బైక్‌పై అక్కడి నుంచి ఉడాయించారు. కొద్ది మేర దూరం వెళ్లిన అనంతరం జనసంచారం అధిక ఉండటంతో వృద్ధుడు గోవింద్ పేపర్ పొట్లం తీసి బంగారు చైన్ వేసుకోవాల్సిందిగా భార్య రాజవ్వకు సూచించారు. వెంటనే వృద్ధురాలి పొట్లం విప్పి చూడగా అందులో బంగారు చైన్‌కు బదులుగా మట్టిసన్నపాటి కంకర రాళ్లు కనిపించడంతో ఖంగుతిని తాము మోసపోయినట్లుగు గుర్తించి కేకలు వేస్తూ పెద్దపెట్టున రోదించింది. దారిన పోయే వాళ్లు బాధిత వృద్ధ దంపతులతో మాట్లాడి సంబంధిత సమాచారాన్ని వారి బంధువులకు చేరవేసారు. వెంటనే బంధువులు ఘటన స్థలికి చేరుకొని సంబంధిత విషయాన్ని పోలీసులకు చేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటన స్థలికి చేరుకొని వృద్ధ దంపతుల నుంచి వివరాలు సేకరించారు. అగంతకుల అచూకి కోసం గాలింపు చర్యలను చేపట్టారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

● నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

నిర్మల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆశా నోడల్ అధికారుల సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ.. అధికంగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులను నియంత్రించడానికి, నివారించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, గత సంవత్సరం అధికంగా వ్యాధులు నమోదైన గ్రామాలపై ప్రత్యేకమైన దృష్టిని సారించే ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని తెలిపారు. డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ 1994 గురించి, ఆడపిల్లల ప్రాముఖ్యత, ప్రాధాన్యత గురించి భృణ హత్యలను నివారించి ఆడపిల్లల లింగ నిష్పత్తి తగ్గిపోకుండా నిరోధించడానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ ఆశిష్‌రెడ్డి, డీపీహెచ్‌ఎన్‌వో సాయమ్మ, డిస్ట్రిక్ట్ డాటా మేనేజర్ గంగాధర్, జిల్లాలోని ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని ఆదర్శ నగర్‌లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతూ... ప్రజలందరూ కూడా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలియజేశారు. వైద్య, ఆరోగ్యశాఖ మున్సిపల్, పంచాయతీరాజ్, మహిళా శిశు అభివృద్ధి శాఖ, ఐకేపీ సిబ్బందితో కలిసి ప్రతి మంగళవారం, శుక్రవారం జిల్లా అంతటా డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, తమ ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడాలని, పగిలిపోయిన రంజన్లు, కుండలు, టైర్లు, ప్లాస్టిక్ బాటిల్స్, కొబ్బరి బొండాలు వంటి వాటిని తొలగించాలని తెలియజేశారు.

ఆరు గ్యారంటీలను అమలు చేశాకే ఓట్లు అడగండి

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

ఖానాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖానాపూర్‌లోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్‌లో ఎందుకు ఆరు గ్యారంటీల ఊసెత్తలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, మండలాధ్యక్షులు పుప్పాల ఉపేందర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ నాయిని సంతోష్, అసెంబ్లీ కో కన్వీనర్ నల్ల రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

బీజేపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

భైంసా రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మారెడ్డి, నాయకులు పండిత్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బిజ్జూర్ గ్రామంలో (శక్తి కేంద్రం ఆధ్వర్యంలో) మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సట్ల సాయినాథ్, మండల ఉపాధ్యక్షులు సోనారి యోగేష్, మండల కార్యదర్శి సత్యనారాయణ్ రెడ్డి, నాయకులు భోజారాం పటేల్, బూత్ అధ్యక్షులు రమేష్; తదితరులు పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొతుల్‌గాం గ్రామానికి చెందిన కూనేరు ఈరన్న(35) అనే వ్యక్తి గొర్ల కాపరి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుండి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడు. జీవితం మీద విరక్తి చెందిన సోమవారం రాత్రి చెరువుకట్టపైన చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి మూడు నెలల కూతురు ఉంది.

ఈదురు గాలుల భీభత్సం

కుంటాల, జూన్, 17 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. సాయంత్రం పూట ఆకాశం మేఘావృతం అవడంతో ఒక్కసారిగా బలమైన గాలి వీచింది. దీంతో కల్లూరు శివారులో గల ఓ రైస్‌మిల్ షెడ్డు నేల మట్టమైంది. కాగా నిర్మాణంలో ఉన్న రైస్ మిల్ షెడ్డు చుట్టు ప్రక్కల వ్యవసాయ పంట పొలాలు ఉన్నవి. గాలివీచిన సమయంలో పక్కన పంట పొలాల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చుట్టు పక్కల పంట చేళ్ల యజమానులు సమాచారం తెలుసుకొని పెనుప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

జై జవాన్ సేవా సమితి సేవలు అనిర్వచనీయం

భైంసా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆపదలోనున్న వారితో పాటు అనాధలకు భైంసా కేంద్రంలోని జై జవాన్ సేవా సమితి అందిస్తున్న సేవలు అనిర్వచనీయమైనవని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ కొనియాడారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జై జవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత కొంత కాలంగా సేవా సమితి సమాజ సేవకు బాధ్యతాయుతంగా సేవలు అందిస్తోందన్నారు. జై జవాన్ సేవా సమితి అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్ మాట్లాడుతూ పలువురు రిటైర్డ్ మిలటరీ అధికారులు, జవాన్లు, పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల యువకులతో కలిసి నిస్వార్థ సేవా కార్యక్రమాల నిర్వహణకు సమితిని ఏర్పాటు చేశామన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శించిన ఎమ్మెల్యే

లోకేశ్వరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుర గ్రామంలో తోకల సాయన్న, బరుడే గొడిసెర చిన్నక్క అస్వస్థతకు గురై ఇటీవలే స్వర్గస్తులైన విషయం తెలుసుకొని మంగళవారం బాధిత కుటుంబాలను కలిసి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన


ఉట్నూర్‌లోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం


ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందుతున్న యువతులు


మగ్గం వర్క్స్ శిక్షణ పొందుతున్న బాలికలు

యువత చూపు.. స్వయం ఉపాధి వైపు

• గ్రామీణ యువతకు శిక్షణలు • బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్స్‌పై శిక్షణ • ఆసక్తి చూపుతున్న యువతులు

ఉట్నూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామ గ్రామాన బ్యూటీ పార్లర్లు వె లుస్తున్నాయి దీంతో యువత అందమైన ఉపాధి బాట పడుతున్నారు. దీని కోసం ఉట్నూర్ లోని కొమురం భీం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామీణ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువతీ యువకులు అనుసరిస్తున్నారు.

గ్రామీణ యువతకు శిక్షణలు

వాణిజ్య బ్యాంకుల సేవలు కొనసాగిస్తూనే మరోవైపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఉట్నూరు పట్టణంలోని కొమరంభీమ్ ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో కలిసిన కోటి రూపాయల భవనాన్ని నిర్మించి స్వయం ఉపాధి శిక్షణతో పాటు భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల యువతి యువకులు ఇక్కడ అందుబాటులో ఉన్న శిక్షణలు పొంది స్వయం ఉపాధి దారి ఎంచుకుంటున్నారు. ఇటీవల బ్యూటీ పార్లర్ శిక్షణతోపాటు మగ్గం వర్క్స్‌పై యువతులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతి యువకులకు స్వయం ఉపాధి పొందేలా బ్యాంకుల ద్వారా ఆర్థిక రుణ ప్రయోజనం కూడా అధికారులు కల్పిస్తున్నారు.

బ్యూటీ పార్లర్ శిక్షణలో..

బ్యూటీ పార్లర్ శిక్షణలో పేషియల్, వ్యాక్స్, హెయిర్ కటింగ్, మేకప్, మెడిక్యూర్, మినీక్యూర్, హైబ్రోస్, మహందిడిజేనింగ్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రత్యేక ఇన్‌స్ట్రక్టర్‌ను ఏర్పాటు చేసి బ్యూటీ పార్లర్ శిక్షణపై మహిళలు ఆసక్తిగా అనుకరిస్తున్నారు.

మగ్గం వర్క్స్‌లో శిక్షణ

ప్రస్తుతం మహిళలు మగ్గం వర్క్ చీరడలు కట్టడంలో చూయిస్తున్న ఆసక్తిని పసిగట్టి ఆర్‌సెట్ అధికారులు మగ్గం వర్క్‌పై మహిళలకు శిక్షణ కల్పిస్తున్నారు. చీరల పై, బౌజ్‌ల పై మగ్గం వర్క్స్ మహిళ సూచన మేరకు వేస్తున్నారు. 30 రకాల హ్యాండ్ ఎంబ్రాయిడింగ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. కాంతంకుట్టు, కాడకుట్టు, పాల్‌కుట్టు, క్లాస్ స్టీచ్, ముద్దకుట్టు, జిగ్‌జాగ్ స్టీచ్, కాశ్మీరి కుట్టు, జర్దోసి, బట్టనోహల్‌స్టిచ్, దువ్వెన కుట్టు లాంటివి 30 రకాల శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక శిక్షకురాలు ఆధ్వర్యంలో మగ్గం వర్క్స్ నేర్పిస్తున్నారు.

వేలాది మందికి శిక్షణ ఇస్తున్నాం

• మహమ్మద్‌గౌస్, డైరెక్టర్ ఆర్‌సెట్ ఉట్నూర్



వాణిజ్య సేవలేకాకుండా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటివరకు వేలాదిగా యువతి యువకులకు శిక్షణలు పూర్తిచేశాం.

స్వయం ఉపాధిపై నమ్మకం పెరిగింది

• వనజ, మేడత్తిడి బెజ్జూర్



ఆర్‌సెట్‌లో మగ్గం వర్క్ పొందాను. మారుమూల బెజ్జూర్ మండలంలోని మేడితడి గ్రామం నుంచి వచ్చి ఉట్నూర్‌లో ఉంటూ శిక్షణ పూర్తి చేసుకున్నా రు. ప్రస్తుతం స్వయం ఉపాధి కోసం షాప్ ఏర్పాటు చేసుకుంటున్నాను.

ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తాను

• డి.శ్రీలత (పెసరిగుంట, దహెగాం)



మగ్గం వర్క్స్ నేర్చుకున్నందున గ్రామీణ ప్రాంతాల్లో స్వయంఉపాధి పొందడానికి ఎంతో అవకాశం ఉంది. మాప్రాంత మహిళల్లో మగ్గం వర్క్స్ నేర్చుకోవాలని ఉంటే నేనే శిక్షణ ఇస్తా. ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి కోసం శిక్షణ పొందాను.

శిక్షణ చాలా బాగుంది

• మహేశ్వరి, అనార్‌పల్లి కెరమెరి



ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఇస్తున్న స్వయం ఉపాధి శిక్షణ బాగుంది. నేను బ్యూటీపార్లర్ శిక్షణ పూర్తి చేసుకున్నాను. మా ప్రాంతంలో ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తాను.

సహకార సంఘాల్లో బదిలీలకు రంగం సిద్ధం!

• సిబ్బంది వివరాలను సేకరించిన ప్రభుత్వం


కుభీర్‌లోని పీఏసీఎస్ కారాల్యయం

భైంసా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో బదిలీల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు సంఘాల్లోని కార్యదర్శుల (సీఈఓ)తో పాటు ఉద్యోగులకు స్థానచలనం కలగనుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) శాఖల పరిధిలోని సంఘాల్లోని పనిచేస్తున్న సిబ్బంది డేటా, సర్వీసు ఇతర వివరాలను ప్రభుత్వం గత నెలలోనే సేకరించింది. కనీసం 3-5 ఐదేళ్ల వరకు ఒకే సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న వారిని ఖచ్చితంగా బదిలీ చేయాలని ఇందుకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించింది. కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ జరుగుతుంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సహకార వ్యవస్థలో బదిలీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రభుత్వ నిర్ణయంపై పీఏసీఎస్ ఉద్యోగ సంఘాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. నిర్మల్ జిల్లా పరిధిలో 17 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా ఇందులో ఒక సంఘం మినహా మిగతా 16 సంఘాలకు చెందిన కార్యదర్శులు, ఉద్యోగుల బదిలీలు జరుగనున్నట్లు తెలుస్తోంది.

• ఏళ్ల తరబడి ఒకే చోట..

నిర్మల్ జిల్లాలోని సహకార సంఘాల్లో చాలామంది ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఒకే చోట పనిచేస్తున్నారు. కొంతమంది అదే సంఘంలో చేరి అక్కడే ఉద్యోగ విరమణ పొందారు. కొందరు ఉద్యోగులు సంఘాల బలోపేతానికి కృషి చేస్తుండగా, మరికొందర ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల సంఘాల అధ్యక్షులను గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్న ఉద్యోగులూ ఉన్నారు. జిల్లాలోని 17 ప్రాథమిక సహకార సంఘాల్లో కొన్ని మెరుగ్గా ఉండగా అధిక శాతం సంఘాలు నష్టాల ఊబిలో కూరుకుపోయి ఉన్నట్లుగా తెలిసింది. కొంతమంది కార్యదర్శులు సుదీర్ఘకాలం ఒకే సంఘంలో విధులు నిర్వర్తిస్తూ, ఇష్టారీతిన వ్యవహరించి వాటిని కోలుకోకుండా చేశారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల నిర్వహణ వ్యవస్థన ప్రక్షాళన చేసి పూర్తిస్థాయిలో మెరుగుపరచే దిశగా తీసుకున్న చర్యల్లో భాగంగానే బదిలీలకు ఉపక్రమించినట్లుగా తెలిసింది. బదిలీల ప్రక్రియను సైతం పారదర్శకంగా చేపట్టేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లుగా సమాచారం.

సన్న ధాన్యానికి అందని బోనస్

• ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

• వెంటనే ఇవ్వాలని కోరుతున్న అన్నదాతలు

సారంగాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించేందుకు సన్న రకం వరి ధాన్యానికి సాగు చేయించాలనే ఉద్దేశ్యంతో క్వింటా సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్‌ను ప్రకటించింది. అయితే వరి ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా సన్నరకం ధాన్యనికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో అన్నదాతలు సన్నరకాలు సాగు చేసేందుకు మొగ్గు చూపారు. ఆరుగాలం కష్టపడి అకాల వర్షాలతో ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొని సన్నరకం వరి సాగుచేశారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు నిరాశే మిగిలింది. ఇంతకు ప్రభుత్వం బోనస్ ఇస్తుందా.. లేదా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోనస్ ప్రకటనలో పెరిగిన సన్నరకం ధాన్యం

సారంగాపూర్ మండలంలో జాం, కొట్ల(బి), బీరవెల్లి ఆలూరు, ప్యారమూరు, చించోలి(యం), జౌలి, గ్రామాలో పాటు తదితర గ్రామాలలో వేసవి తీవ్రత ఏర్పడి నీటి ఎద్దడి పరిస్థితులు రాకముందే పంట చేతికి వచ్చే విధంగా యాసంగిలో స్వర్ణ ప్రాజెక్టు సాగు నీరుతో సాధారణంగా దొడ్డు రకాలు సాగుచేసేందుకు రైతులు మొగ్గు చూపేవారు. వ్యవసాయ అధికారుల చర్యలతో మండల పరిధిలో కొంతమంది రైతులు సన్న రకాలను సాగు చేశారు. అయితే సన్నరకాలు విక్రయించిన ఏ ఒక్క రైతుకు బోనస్ డబ్బులు నేటికీ జమకాలేదు. దీంతోపాటు దిగుబడి రాక రైతులు ఆందోళన చెందుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి ముగిసి వానాకాలం పంటలు వేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలకు సాగు భూములు దుక్కిలు దున్నడానికి పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులు రైతులను దృష్టిలో ఉంచుకొని సన్న రకాల బోనస్ డబ్బులను రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని కోరుతున్నారు.

కారం కాయకు భలే డిమాండ్

• ఒక్కటికి రూ.7 చొప్పున అమ్ముతున్న వ్యాపారులు


అమ్మడానికి సిద్దంగా మామిడి కాయలు


పచ్చడి కోసం కాయలను ముక్కలు చేస్తున్న దృశ్యం

భైంసా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మామిడి పంటకు ధరల లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత సంవత్సరంతో పోల్చితే దిగుబడులు అధికంగా రావడంతో ఈసారి ధరలు తగ్గిపోయాయి. పేరుగాంచిన పండ్లకు సైతం పెద్దగా ధరలు లేకుండాపోయాయి. పెద్ద మార్కెట్లకు ఏమైనా ధర వస్తుందేమోనని ఆశించిన రైతుకు అక్కడా నిరాశే మిగిలింది. కానీ మామిడి కారానికి ఉపయోగించే కాయలకు మాత్రం భలే డిమాండ్ ఏర్పడింది. వాటి ధర మరోలా ఉంది. భైంసా మార్కెట్‌లో వారం రోజులుగా కారం కాయల అమ్మకం జోరుగా సాగుతోంది. సైజును బట్టి కాయలు అమ్ముడుపోతున్నాయి. గత ఏడాది కారం కాయలు రూ.60 నుంచి రూ.70లకు కిలో లభ్యమవ్వగా ఈయేడు వాటి ధర రూ.80 నుంచి రూ.100కు ఎగబాకాయి. పండ్లకు లేని ధర కారం కాయలకు ఉండడంతో చాలా మంది మామిడి వ్యాపారులు ప్రస్తుతం కారం కాయల వైపు దృష్టి మళ్లించారు.

ఘాటెక్కిన మామిడి కారం

కారం కాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో చాలా మంది మామిడి కారం తయారు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. గతేడాది ధరలో పోల్చి చూస్తే కారం కాయల ధర కిలోకు రూ 20 నుంచి రూ.30 వరకు పెరిగాయి కాయలతో పాటు కారం పెట్టడానికి వినియోగించే వాటి ధరలు సైతతం పెరుగుదల బాట పట్టడంతో వినియోగదారులు వెనుకడుగు వేస్తున్నారు. కారం కాయల ధరలు అధికంగా పలకడంతో కొద్ది రోజులు ఆగితే ధర తగ్గకపోదా అని చాలా ఇళ్లలో మామిడి పచ్చడి తయారు చేసుకునే ఆలోచనను పొడగిస్తున్నారు. మరోవారం 10 రోజుల దాటితే కారం తయారుకు గడువు దాడిపోతుందనే ఉద్దేశంతో కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. హోటళ్లు, కర్రీ పాయింట్‌లో తప్పనిసరి కావడంతో ఎక్కువ ధరకు కాయలను కొంటున్నారు.


గురుకుల కళాశాలలు ఏర్పాటు చేసిన ఫోన్లు

గురుకుల కళాశాలలో ఫోన్ సౌకర్యం

బోథ్, జూన్17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అధికారులు, విద్యార్థుల సౌకర్యం ఫోన్ మిత్ర ఆధ్వర్యంలో ఏడు ఫోన్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు వారానికి ఒకసారి ఫోన్ మాట్లాడే అవకాశం కల్పించడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో స్మార్ట్‌కార్డులను అందించనున్నారు. అయితే నలుగురు విద్యార్థులను కలిపి ఒక స్మార్ట్ కార్డును అందించేలా ఆలోచన చేస్తున్నారు.

• ఫోన్ల ఏర్పాటుతో విద్యార్థుల్లో ఉత్సాహం

ఫోన్‌నెంబర్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ యోగక్షేమాలను తెలుపుతూ తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం కలిగిందని విద్యార్థులు అంటున్నారు. గతంలో పిల్లల తల్లిదండ్రులు వచ్చినప్పుడు వారితో తీసుకువచ్చిన ఫోన్లను అడిగి తల్లిదండ్రులతో మాట్లాడాల్సి వచ్చేదని విద్యార్థులకు చెప్తున్నారు. కళాశాలలో ఫోన్లు ఏర్పాటు చేయడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే తమ తల్లిదండ్రులకు ఇబ్బందులు తగ్గుతాయని అంటున్నారు.

అధికారులతో మాట్లాడే వీలుంటుంది

• సంగీత, ప్రిన్సిపాల్



స్మార్ట్‌ఫోన్‌లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు తమ తల్లిదండ్రులతోనే కాకుండా ఏమైనా ఇబ్బంది ఉంటే నేరుగా అధికారులు, సెక్రటరీతో మాట్లాడే అవకాశం ఉంటుంది. అధికారులు సైతం ఫోన్లు చేసి నేరుగా విద్యార్థుల సాధకబాధకాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. త్వరలోనే ఈ ఫోన్‌లో వినియోగం ప్రారంభిస్తాం. ఫోన్ సౌకర్యం ఏర్పాటుపై విద్యార్థులు చాలా సంతోషంగా ఉన్నారు.

జర దేఖో!!


విద్యార్థులు లేక వెలవెలబోతున్న కళాశాల గదులు


రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేక ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ కుర్చీ


కళాశాల ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలు

విద్యార్థుల్లేక కళ తప్పిన కళాశాల

• తలమడుగు జూనియర్ కళాశాలలో కనీస వసతులు కరువు • కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు

• ఈ విద్యాసంవత్సరానికి చేరింది 22 మంది విద్యార్థులే • సమస్యలు పరిష్కరించాలంటున్న విద్యార్థులు


తలమడుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

తలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లేక తలమడుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కళ తప్పింది. కళాశాలలో కనీసం వసతులు లేకపోవడం, పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపాల్ సహా సిబ్బంది కొరతే కారణమని తెలుస్తోంది. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలని సంకల్పంతో గత 20 ఏళ్ల క్రితం తలమడుగు మండల కేంద్రంలో ప్రభుత్వం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి ఎంతమంది విద్యార్థులకు ఉన్నత విద్య రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ఫలితాలు అందించి మంచి గుర్తింపు తెచ్చిన తలమడుగు జూనియర్ కళాశాల నేడు విద్యార్థులు లేక వెలవెలబోతోంది.

కళాశాలలో పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరు. దీంతో తాంసి కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో కళాశాల కొనసాగడంతో కళాశాలలో పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా సిబ్బంది సమయపాలన పాటించడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనికి తోడు కళాశాలలో గ్రామీణ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడడం లేదు. ఈ సంవత్సరం కళాశాలలో ఇప్పటివరకు కేవలం 22మంది విద్యార్థులే మొదటి సంవత్సరంలో చేరడం ఆందోళన గురిచేస్తోంది. కళాశాల చుట్టూ ముడ్ల పొదలు, చెత్తాచెదారం చేరి అడవిని తలపించేలా కళాశాల చుట్టూ ఉన్నప్పటికీ ఎవరూ. పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో 400లకు తగ్గని విద్యార్థులు

గతంలో తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 400 నుంచి 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసించేవారు. ఇందులో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కానీ నేడు కళాశాల్లో ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయి అస్తవ్యస్తంగా మారింది. గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలం నుంచి సుమారు 450 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. వీరిలో కనీసం సగం మంది కూడా మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరలేదు. కేవలం 22మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకునేందుకు ప్రవేశం పొందారంటే కళాశాల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఫలితాల్లో 90శాతం ఉత్తీర్ణత

గత మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 90శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. కళాశాలలో విద్యాబోధన అధ్యాపకులు, విద్యార్థులకు మంచిగానే అందిస్తున్నప్పటికీ విద్యార్థులు కళాశాలలో చదువుకునేందుకు ఎందుకు రావడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది విద్యార్థులు హాస్టల్ వసతి ఉన్న కళాశాలలో చేరేందుకు వెళ్లిపోయారు. మరి కొంతమంది విద్యార్థులు మండలం నుంచి జిల్లా కేంద్రానికి చదువుకునేందుకు వెళ్తున్నారు. కాగా మారుమూల గిరిజన గ్రామాల్లో గల ఆదివాసి పిల్లలకు ఉన్నత చదువులు చదివింది ఎందుకు బస్సు సౌకర్యం లేక ఇతర మౌలిక వసతులు లేక కళాశాల చేరేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేరిపించేందుకు 11 మంది అధ్యాపకులు మండలంలోని ఆయా గ్రామాల్లోకి వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులతో అవగాహన కల్పించినప్పటికీ కళాశాలలో చేర్పించేందుకు ఇష్టపడతలేరు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తలమడుగు కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
☛ వివాహ వార్షికోత్సవం
☛ స్వదేశీ, విదేశీయానం
☛ లీగల్ ప్రకటనలు
☛ పదవీ విరమణ
☛ శ్రద్ధాంజలి
☛ జన్మదినం
☛ షష్టిపూర్తి
☛ జయంతి
☛ వర్ధంతి
☛ క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453



'ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పోటీపడాలి'

ఉట్నూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ తెలుగు మీడియం పాఠశాల సమ్మిళిత విద్యా అవకాశం గురించి ప్రధానోపాధ్యాయుడు జాదవ్ రమేష్ విద్యార్థులకు మంగళవారం వివరించారు. 'అందరికీ విద్య అందరితో విద్యా' అనే నినాదంతో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సాధారణ పాఠశాల విద్యార్థులతో కలిసి చదవడం వారితో పోటీ పడే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్, సిబ్బంది

బడీడు పిల్లలు పనిలో కాదు.. పాఠశాలల్లో ఉండాలి : కో ఆర్డినేటర్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలు పనిలో కాదు పాఠశాలల్లో ఉండాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు బాల కార్మికులను గుర్తిస్తున్నామని చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ సతీష్‌కుమార్ తెలపారు. మంగళవారం పట్టణంలో ఆయా రెస్టారెంట్స్, పండ్లు, స్క్రాప్ దుకాణాలలో తనిఖీ చేశారు. బాల కార్మికులను గుర్తించి తల్లిదండ్రులతో పాటు వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గుర్తించిన బడీడు పిల్లలను వారు ఉంటున్న కాలనీల్లోని సమీప ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చేర్పించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. కలెక్టర్, జిల్లా బాలల సంరక్షన అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేసి వారిని గుర్తిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై అనిత, కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సుదీప్ రెడ్డి, అవుట్ రిచ్ వర్కర్ అశ్విని, చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, సీఆర్పీ భాను ప్రకాష్, షూర్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ కె.వినోద్, కానిస్టేబుల్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ దినసరి ఉద్యోగుల వేతనాల బడ్జెట్ విడుదల

ఉట్నూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగులు, శానిటేషన్ వర్కర్ల వేతనాల బడ్జెట్ విడుదల చేశారని తెలంగాణ గిరిజన తెలంగాణ గిరిజన సంక్షేమ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు షావుకత్‌హుస్సేన్‌లు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి మూడు నెలల వేతన బడ్జెట్ రూ.6.28 కోట్లు మంజూరు చేశారని, అందులో జిల్లాకు రూ.89 లక్షలు, ఆసిఫాబాద్‌కు రూ.60లక్షలు, నిర్మల్ జిల్లాకు రూ.19.68 లక్షలు, మంచిర్యాల జిల్లాకు రూ.21.08లక్షలు విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ దిలీప్‌కుమార్ వేతనాలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● నిరుపయోగంగా మారిన హత్తిఘాట్ ఎత్తి పోతల పథకం



ఎత్తి పోయట్లే!

ఆదిలాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో సాగునీటి వనరులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. గత 8 ఏళ్లుగా కోర్టా-చనకా బ్యారేజీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. హత్తిఘాట్ పంప్‌హౌజ్ వెట్‌రన్‌ను నిర్వహించిన నిరుపయోగంగానే మారింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రయోజనమే లేకుండా పోతుంది. దీంతో వర్షాధార పంటల పైననే ఆధారపడి సాగు చేయాల్సి వస్తుంది. సారవంతమైన నేలలు ఉన్న.. సాగునీటి వసతి లేకపోవడంతో వానాకాలం సీజన్ పంటలకే పరిమితం కావాల్సి వస్తుంది. గతంలో నిర్మించిన చిన్ననీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. జిల్లాలో 2 లక్షల 5 వేల హెక్టార్ల సాగు భూమి అందుబాటులో ఉండగా.. యేటా 2లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇందులో కేవలం 48 వేల హెక్టార్లకు మాత్రమే సాగునీటి వసతి ఉంది. మిగితా లక్షా 52 వేల హెక్టార్లలో వర్షాధారం పైననే ఆధారపడి పంటలను సాగు చేయాల్సి వస్తుంది. నీటి లభ్యత ఉన్నా.. ప్రాంతాల్లో గత ప్రభుత్వాలు ఎత్తిపోతల పథకాలను నిర్మించాయి. ఏళ్ల తరబడి వీటి నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారి కనిపిస్తున్నాయి. చిన్ననీటి పథకాలను అందుబాటులోకి తీసుకొస్తే వేల ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉందని అన్నదాత లు వాపోతున్నారు.

అక్కరకు రాని పథకాలు

అందుబాటులో సాగునీరు ఉన్న చిన్ననీటి పథకాలు అక్కరకు రాకుండానే పోతున్నాయి. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్నా పెన్‌గంగా నదితో పాటు కడెం నదులలో పుష్కలంగా నీళ్లున్నా.. ఎత్తిపోసే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో యేటా వేల క్యూసెక్కుల సాగునీరు వృధాగా దిగువకు వెళ్లిపోతుంది. జిల్లాలో మొత్తం 12 ఎత్తిపోతల పథకాలు ఉండగా.. ఒకటి మాత్రమే అడపాదడప పని చేస్తుంది. తాంసి మండలంలో అర్లి(టి), తలమడుగు మండలం కప్పర్‌దేవి, నేరడిగొండ మండలం వెంకటాపూర్, బుద్ధికొండ, జైనథ్ మండలం సాంగ్వి, బేల మండలంలో కంగర్‌పూర్, మంగురూల్, ఆదిలాబాద్ మండలంలో చించుఘట్, బజార్‌హత్నూర్ మండలంలో దేగాం, బోథ్ మండలంలో పొచ్చర, కుచులాపూర్ పథకాలు నిరుపయోగంగా మారి కనిపిస్తున్నాయి. సోనాల ఎత్తిపోతల పథకం మాత్రం అడపాదడప పని చేస్తుంది. కొన్ని పథకాలు లీకేజీలతో మూలన పడగా.. మరికొన్నింటికి విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. ఇప్పటికే కొన్ని పథకాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు చేసేందుకు కూడా అవకాశం లేకపోవడంతో నిర్లక్ష్యంగానే వదిలేస్తున్నారు.


- జిల్లాలో నిరుపయోగంగా మారిన ఎత్తి పోతల పథకాలు
- అందుబాటులో నీటి వనరులున్నా.. ప్రయోజనం శూన్యం
- హడావుడి చేసి హత్తిఘాట్‌పై చేతులెత్తేసిన అధికారులు
- అడుగు ముందుకు పడని కాండ్లి ఎత్తిపోతల పనులు
- ఇటు ప్రభుత్వం గానీ.. అటు పాలకులు గానీ దృష్టి సారిస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామలం

పంప్‌హౌజ్ సిద్ధంగానే ఉంది

: కె.రవీందర్, ఈఈ, నీటి పారుదల శాఖ

కోర్టా-చనకా బ్యారేజి ఎగువ భాగాన పెన్‌గంగా నదిపై నిర్మించిన హత్తిఘాట్ పంప్‌హౌజ్ సిద్ధంగానే ఉంది. కానీ కాల్వల నిర్మాణం పనులను పూర్తి చేయాల్సి ఉంది. అవసరమైన భూసేకరణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులను ప్రారంభిస్తాం. ఇప్పటికే వెట్‌రన్‌ను కూడా పూర్తి చేయడం జరిగింది. కాల్వల నిర్మాణం పూర్తయితే హత్తిఘాట్ పంప్‌హౌజ్ ద్వారా నీటిని ఎత్తి పోసే అవకాశం ఉంటుంది. అలాగే కోర్టా-చనకా బ్యారేజి పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. కాల్వల నిర్మాణం పనులే ఆలస్యమవుతున్నాయి. పనులు పూర్తికాగానే ఆయకట్టుకు సాగునీటిని అందిస్తాం.

ఎత్తి పోసేది ఎప్పుడు?



లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టులో భాగంగా కోర్టా-చనకా బ్యారేజి ఎగువ భాగాన హత్తిఘాట్ పంప్ హౌజ్ నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా.. చుక్కనీటిని ఎత్తిపోసిన దాఖలాలు లేవు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడి చేసిన అధికారులు.. ఎన్నో తంటాలు పడి వెట్‌రన్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత పంప్‌హౌజ్ జోలికె వెళ్లినట్లు కనిపించడం లేదు. అయిన కోట్ల రూపాయల విద్యుత్ బిల్లుల బకాయిలు కనిపిస్తున్నాయి. ఈ యేడు కూడా పంప్ హౌజ్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ఇంకా అసంపూర్తిగానే కాల్వల నిర్మాణం పనులు

(తరువాయి 6వ పేజీలో...)

యువత చూపు.. స్వయం ఉపాధి వైపు



- ఉట్నూర్‌లో గ్రామీణ యువతకు వివిధ అంశాలలో శిక్షణలు
- బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్స్‌పై శిక్షణ
- ఆసక్తి చూపుతున్న యువతులు

వివరాలు 7వ పేజీలో...

పాత కరత్వాడ పాఠశాలలో ఒకే విద్యార్థి



- బోథ్‌కు 3 కి.మీ. దూరంలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయురాలూ ఒక్కరే..
- పిల్లలను బడికి పంపాలంటూ ఇంటింటికీ తిరుగుతున్న అధికారులు

వివరాలు 6వ పేజీలో...



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్య సంస్థల్లో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని భవిత విలీన విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విలీనవిద్య దినోత్సవం, బాలిక విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. బాలిక విద్య ప్రాముఖ్యతను, సీడబ్ల్యుఎస్ఎన్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యతలు, వారికి విద్య అందించాల్సిన ఆవశ్యకత పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలతో అక్షరాభ్యాసం చేయించి భవిత కేంద్రంలో అడ్మిషన్ చేయించి, 7వ తరగతి పూర్తయిన వారికి వివిధ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు.ఇందులో ఎంఈఓ సోమయ్య,సెక్టోరల్ అధికారులు సుజాత్‌ఖాన్, తిరుపతి, శ్రీకాంత్, కాంప్లెక్స్ ప్రధనోపాధ్యాయులు లచ్చిరాం, ఎన్జీవో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, భవిత కేంద్రం ఐఈఆర్పీలు పుష్పవేణి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటు బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం మంజూరు : పీవో

ఉట్నూర్, జూన్17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గాదిగూడ, బేల మండలంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన ప్రమాద బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25వేల వంతున తక్షణ ఆర్థిక సహాయం మంగళవారం మంజూరు చేయడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. గాదిగూడ మండలం పిప్రి గ్రామానికి చెందిన సిడాంరంబబాయి,పెందూరు సంజన, మంగంబీంబాయి, సోన్‌కాసకు చెందిన పెందూరు మాధవరావు, బేల మండలం సాంగిడి గ్రామానికి చెందిన కోవ సునిత, గేడం నందిని కుటుంబాలకు రూ.25వేల వంతున తక్షణ సహాయం మంజూరు చేశామన్నారు.

కేబీ నగర్ సెంటర్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట

ఉట్నూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం పంచాయతీలో ఉన్న కొమురంబీం నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉట్నూర్ సీడీపీఓ మాస ఉమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన కిట్లు అందించి వాటి పని తీరు గురించి పిల్లల తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజులత, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో మాస ఉమాదేవి



దస్నాపూర్ గ్రామంలో రైతుల భూమి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

భూ భారతిలో భూ సమస్యల పరిష్కారం

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● దస్నాపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు ● హాజరైన ఉట్నూర్ సబ్ కలెక్టర్, అధికారులు

ఇంద్రవెల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కుంటున్న వివిధ భూ సమస్యల కోసమే ప్రభుత్వం భూ భారతి సదస్సులు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం మండలంలోని దస్నాపూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌తో కలిసి హాజరయ్యారు. ముందుగా పీఎం జన్ మన్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ న్యాయ మహా అభియాన్ సంచార వైద్య వాహనం ద్వారా పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద పీవీటీజీలతో పాటు ప్రతీఒక్కరు వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యలైన బీపీ, షుగర్, తదితర పరీక్షలను వైద్యశిబిరంలో చేసుకోవాలన్నారు.

● గర్భిణులపై దృష్టి సారించాలి

ప్రతీ గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, గర్భం ధరించినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పుట్టిన శిశువుకు క్రమం తప్పకుండా వాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు, రైతులు అసైన్డ్ భూమితో పాటు భూముల పట్టాల కోసం కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తన పరిధిలో లేని భూ సమస్యలపై ఉన్నతాధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని భరోసా ఇచ్చారు. దస్నాపూర్ గ్రామస్తులు జవాదే కేశవ్, గ్రామ పటేల్ పొటులే పుండలిక్, తదితరులు విద్యుత్ సబ్ స్టేషన్ కోసం కోసం విరాళంగా భూమిని ఇచ్చామని, ప్రస్తుతం తమ గ్రామానికే విద్యుత్ ఉండటం లేదన్నారు. ఫీడర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కలెక్టర్ ఆ శాఖ ఏస్ఈకి ఫోన్‌లో సంప్రదించి ఫీడర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ఆ తర్వాత, భూ భారతి రెవెన్యూ సదస్సులో ప్రజలనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. రైతుల భూసమస్యలైన పట్టా పాస్ బుక్‌లో తప్పుడు పేర్లు,



వైద్య శిబిరంలో రికార్డులను పరిశీలిస్తూ..

భూ విస్తీర్ణం సమస్యలు, ఆధార్ లింక్ చేయడం వంటి సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో రేషన్ కార్డు, ఉపాధిహామీ లో జాబ్ కార్డు లేని వారికి కార్డు ఇవ్వడం, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. రైతులకు భూ భారతి చట్టం 2025కు ప్రాధాన్యత నిస్తూ, వారి భూమి సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

● రైతులు సద్వినియోగం చేసుకోవాలి : అదనపు కలెక్టర్

తాంసి: భూ భారతి కార్యక్రమం భూమి పాత సమస్యలకు పరిష్కారం కలిగిస్తుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో భూభారతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ భూభారతి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏళ్ల నుంచి పరిష్కారం కాని సమస్యలకు ఈ భూభారతిలో పూర్తిగా పరిష్కారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.

● ప్రతీ అర్జీ పరిష్కారమయ్యేలా చూస్తాం

నేరడిగొండ: భూభారతి సదస్సుల్లో వచ్చిన ప్రతీ అర్జీని పరిశీలించి పరిష్కారమయ్యేలా చూస్తామని తహసీల్దార్ కలీం అన్నారు. మండలంలోని వడూర్, బుగ్గారం గ్రామాలలో మంగళవారం నిర్వహించిన భూభారతి సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలపై ఎవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగొద్దన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దరఖాస్తులను నిశితంగా పరిశీలించి అధికారులు పరిష్కార మార్గాలను చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, ఎంఆర్‌ఐ నాగోరావ్. ఎంసీ శంకర్. ఏఈవో జైపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏజెన్సీలో గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలి

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం బుర్సన్ పటార్ గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనేతరులు 1970 కంటే ముందు నుంచి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు, పహనీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరులకు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, రైతు బంధు, రైతు బీమాతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోన్ కాంబ్లే పీరాజీ, కాంబ్లే భారత్, గాయక్ వాడ్ మాధవ్, బాలేరావ్ రాందాస్, లాండ్గే దయానంద్, సోన్ కాంబ్లే ప్రేంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

● సదస్సులో 32 సమస్యలపై వినతులు

ఉట్నూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండలంలోని సాలెవాడ, తాండ్ర గ్రామాలలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 32 సమస్యలపై వినతులు స్వీకరించడం జరిగిందని ఉట్నూర్ ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ అమృత లాల్ తెలిపారు. ఉట్నూర్, సాలెవాడ, తాండ్ర గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో జరిగిన గ్రామసభలో ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్‌అమృత్ లాల్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదస్సుల ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలలో నమోదు కాని వివరాలు తెలిపితే వాటిని చేర్చడం జరుగుతుందన్నారు. సర్వే నెంబర్లు తప్పుగా ఉన్న నమోదు చేయడం జరుగుతుందన్నారు.వారసత్వ సమస్యలకు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిర్ధావర్‌అనిత, పంచాయతీ కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



హస్నాపూర్ గ్రామంలో సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్



వడూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖలీం



బుర్సన్ పటార్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు